కొల్లూరు ఉపాధ్యాయుల పనితీరుపై చర్చ

నవాబ్‌పేట, జూన్ 25 : మండలంలోని కొల్లూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై మండలంలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'మత్తు వదలరా' అనే కథనంపై విద్యావంతులు, మేధావులు, మండల ప్రజలు చర్చించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్లు స్టాఫ్ రూమ్‌లో నిద్రించడమేమిటని మాట్లాడుకోవడం వినిపించింది. గతంలోనూ వీరు దాబాలో కనిపించగా, గ్రామ యువకులు నిలదీసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఈ విషయమై మండల విద్యాశాఖ నోడల్ అధికారి స్పందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఆసరా పింఛన్లు పెంచాలి

వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన ఆసరా లబ్ధిదారులు

అయిజ, జూన్ 25 : ప్రభుత్వం ఆసరా పింఛన్లు తక్షణమే పెంచి లబ్ధిదారులకు అందజేయాలని బీఆర్ఎస్వీ నాయకుడు మల్లికార్జున్ కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆసరా లబ్ధిదారులతో కలిసి బీఆర్ఎస్వీ నాయకులు మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మన్నకు వినతిపత్రం అందజేశారు. ఆరు గ్యారెంటీల్లో పింఛన్ల పెంపు ఒకటని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 2వేల నుంచి రూ. 4వేలకు, దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ. 6వేలకు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఆరు నెలలైనా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే పింఛన్లు పెంచి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు వెంకట్రాములు, వెంకటన్న, నాగమ్మ, అబ్దుల్లా పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

కోర్లకుంట అలుగును పరిశీలిస్తున్న ఏఈ సంబీప్‌రెడ్డి

బల్మూరు, జూన్ 25 : మండలంలోని జినుకుంట గ్రామంలోని కోర్ల కుంట, ఊరచెరువు వంటి కుంటలను ఇరిగేషన్ ఏఈ సందీప్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కోర్లకుంటలో అలుగు వద్ద నీళ్లు నిల్వకుండా పగులగొట్టారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఏఈ సందర్శించారు. అలాగే ఊరచెరువు తూంను ఆయన పరిశీలించారు. రైతులు చెప్పిన చెరువులు, కుంటల వద్ద ఉన్న సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామ న్నారు. ఆయన వెంట ముదిరాజ్ సంఘం నాయకులు, రైతులు నారాయణ, శేఖర్, సాయిలు, మల్లేశ్, శ్రీను, దశరథం, కుర్మయ్య, మల్లయ్య, కృష్ణయ్య తదితరులున్నారు.

సేంద్రియం.. భూమికి సారం

- రసాయనిక ఎరువులతో పెట్టుబడుల భారం
- సహజసిద్ధ ఎరువుల్లో పోషకాలు అనేకం
- వర్మీ కంపోస్టుతో ప్రయోజనాలెన్నో..

అయిజ, జూన్ 25 : వ్యవసాయ భూములు రసాయని క ఎరువుల వాడకంతో నిస్సారమయ్యాయి. ఫలితంగా దిగుబడులు ఏటేటా తగ్గుముఖం పడుతున్నాయి. 30ఏండ్ల కిందట వచ్చిన దిగుబడులే నేడు వస్తున్నాయని వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారు. బస్తాల కొద్ది రసాయనిక ఎరువులు కుమ్మరిస్తున్నా.. పెట్టుబడులు రాని దైన్యం. పంటలకు 16రకాల పోషకాలు అవసరమని, రైతులు వాడుతున్న రసాయనిక ఎరువులతో కేవలం ఒకటి, రెండు పోషకాలు మాత్రమే అందుతున్నాయని.. అదే సేంద్రియ ఎరువులు వాడితే మొక్కలకు అందాల్సిన 16రకాల పోషకాలు అందుతాయని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇంతేకాకుండా సేంద్రియ వ్యవసాయ సాగుతో పండించిన ధాన్యానికి ధర ఎక్కువ పలు కుతుందని చెబుతున్నారు.

పెట్టుబడుల భారం ..

పశు సంపద తగ్గిపోవడం.. రైతులు రసాయనిక ఎరువులకు అలవాటు పడటంతో భూసారం తగ్గిపోతోంది. దీంతో దిగుబడులు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా బస్తాల కొద్ది యూరియా, డీఏపీ వేయడంతో నేల భౌతిక స్వభావం మారిపోతోంది. రసాయనిక ఎరువుల వాడకం పెరుగుతుండటంతో పెట్టుబడుల భారం రైతులకు పెరుగుతోంది. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి పంటలు భూసారాన్ని లాగేస్తాయి. దీనికితోడు యూరియా, డీఏపీలు మరింతగా నేల సారాన్ని పీల్చివేస్తాయి. నేలలో లవణాలు తగ్గిపోయి దిగుబడులు తగ్గిపోతు న్నాయి. దీనికి తోడు ఏటేటా వానలు కూడా తగ్గుముఖం పట్టడంతో నేలలు తడవడం లేదు. తొలకరి వానలు పడినప్పుడు మే, జూన్ నెలల్లో దుక్కులు కలియ దున్నిన చౌడునేలల్లో పిల్లి పెసర, జీలుగ పంటలు వేయడం.. అవి మొలకెత్తిన తర్వాత కలియ దున్నితే మూలకాలు మారుతాయి.

సేంద్రియ ఎరువుల్లో పోషకాలు అనేకం..

వర్మికంపోస్టు అంటే వానపాముల ఎరువు, పచ్చిరొట్ట, పశువుల ఎరువు వాడటంతో పంటలు 16 రకాల పోషకాలు అందుతాయి. వీటిలో సూక్ష్మపోషకాలైన ఐరన్, కాపర్, మెగ్నిషియం, సల్ఫర్, జింక్ తదితరాలన్నీ ఉంటా యి. వీటికి తోడు జీవ నియంత్రణ ఎరువులు కూడా వేస్తే తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చు. ఒకసారి సేంద్రియ ఎరువులు వేసినంత మాత్రాన దిగుబడులు రావు. రసాయనిక ఎరువులకు అలవాటు పడిన పొలాల్లో కొన్నేండ్లపాటు సేంద్రియ ఎరువులు వాడితేనే ఫలితం వస్తుంది. రైతులు రసాయనిక ఎరువులను వాడుతూ పోతే దిగుబడులు ఏ మాత్రం రాకపోగా పెట్టుబడులు వాటికే సరిపోతాయి.

వర్మీ కంపోస్టు వల్ల ప్రయోజనాలు ..

వర్మీ కంపోస్టుతో నేల ఉత్పాదకతకు కావాల్సిన అనుకూల లక్షణాలు పెరుగుతాయి. ఇది ఆ పంటకే కాకుండా రెండుమూడు పంటలపై ప్రభావం చూపుతుంది. మొక్కకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాస్‌తోపాటు పైరు ఎదుగుదలకు అవసరమయ్యే సేంద్రియ రసాయనాలు అధికంగా ఉంటాయి. భూమికి ఉపయోగమైన సూక్ష్మజీవులు వృద్ధి చెంది నేలకు ఇస్తాయి. కూరగాయలు, పండ్ల ఉత్పత్తుల నాణ్యత పెరుగుతుంది. రంగు, రుచి, వాసన, రవాణాలో నిల్వ ఉండే గుణం కలిగి ఉంటాయి.

సేంద్రియ ఎరువు తయారీ సులువే ..

సేంద్రియ ఎరువులను సులువుగా తయారు చేసుకోవచ్చు. పశువుల వ్యర్థాలను ఇష్టానుసారంగా పారేయకుండా చెత్తను విడదీసి పశువుల పేడను ఒక పద్ధతి ప్రకారం నిల్వ ఉంచితే కొద్దిరోజు ల్లో సేంద్రియ ఎరువు లభిస్తుంది. జిల్లాలోని కొందరు రైతులు సొంతంగా సేం ద్రియ ఎరువులను తయారు చేసుకుంటున్నారు. రసాయనిక ఎరువుల వినియోగం వల్ల వచ్చే దిగుబడుల కంటే సేంద్రియ ఎరువుల వినియోగం వల్లే నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి.

–గోవింద్‌నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, జోగుళాంబ గద్వాల.

నారు పెంపకంపై రైతులకు అవగాహన

రైతులకు సామాగ్రి అందజేస్తున్న దృశ్యం

బిజినేపల్లి, జూన్ 25 : మండలంలోని పాలెం గ్రామంలోని వ్యవసాయ కళాశాలలో షెడ్‌నెట్ కింద కూరగాయల నారు పెంపకంపై రైతులకు అసోసియేషన్ డీన్ పుష్పావతి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఆధునిక పద్ధతిలో టమాట, వంకాయ, బంతి నారు, మిరప వంటివి షెడ్‌నెట్‌కింద నారు పెంచడం వల్ల ఎక్కువ మొత్తంలో నారు బతుకుతుందని వివ రించారు. అనంతరం తాడూరు మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రైతులకు ఉచితంగా ప్రొటేట్లు ఖోఖో ఫీడ్, రోజ్‌స్కాన్, ట్రేలను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భానుశ్రీ, శరణ్‌తేజ, సత్యనారాయణ, సిద్ధప్ప, ఆదిశంకర్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నాగర్‌కర్నూల్, జూన్ 25: పరీక్షల్లో తప్పానని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. జిల్లా కేంద్రంలోని పద్మావతి జూనియర్ కళాశాల హాస్టల్‌లోనే ఉంటూ ఇంటర్ చదువుతున్న విద్యార్థి సప్లిమెంటరీ పరీక్షల్లోనూ మళ్లి తప్పానని తీవ్ర మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కళాశాల నిర్వాహకులు జిల్లా దవాఖానకు తరలించారు. విద్యార్థి ఉంటున్న హాస్టల్‌లోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం విశేషం. కాగా విద్యార్థి స్వస్థలం నాగార్జునసాగర్‌గా నిర్వాహకులు పేర్కొన్నారు. సమాచారం తల్లిదండ్రులకు చేరవేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- మూడు నెలల వేతనాలు అందించాలి
- అర్చకుల ఆత్మీయ సమేళనం

ఉండవెల్లి, జూన్ 25 : కేసీఆర్ ప్రభుత్వం అర్చకులకు రూ.10 వేలను గౌరవ వేతనంగా అందించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తా మార్కెట్ యార్డులో ఉమ్మడి జిల్లా ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మా ట్లాడుతూ తమకు దాదాపు మూడు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అర్చకులు ఆలయాల్లో వివిధ పూజలు నిర్వహించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. అర్చకులకు కనీస వేతనంతోపాటు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, వెల్ఫేర్ ఫండ్, అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అర్చక సంఘం నాయకులు రామలింగేశ్వర శర్మ, నాగ దక్షిణామూర్తి, హరికృష్ణశర్మ పాల్గొన్నారు.

రేవల్లిలో గంజాయి విక్రయం కలకలం

- విక్రయదారుడిపై కేసునమోదు

రేవల్లిలో గంజాయి విక్రయదారుడి నుంచి గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

గోపాల్‌పేట, జూన్ 25: వనపర్తి జిల్లాలోని రేవల్లి మండల కేంద్రంలో గంజాయి విక్రయం కలకలం రేపింది. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు ఎద్దుల చింతలయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా చింతలయ్య కొంతకాలం కిందట శ్రీశైలం వెళ్లి ఓ సాధువుతో పరిచయమై గంజాయి విత్తనాలు సేకరించాడు. వాటిని తీసుకొచ్చి పెరటిలో వేసి, మొక్కలు ఎదిగాక వాటిని ఎండబెట్టి గంజాయిని విక్రయిం చడం మొదలు పెట్టాడు. కొంతకాలంగా ఇదే వృత్తిగా ఎంచుకున్నాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం పోలీసులు చింతలయ్య ఇంట్లో సోదాలు చేయగా, ఇంట్లో 5గ్రాముల గంజాయి, ఇంటి ఎదుట పెరటిలో గంజాయి మొక్కలు లభించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాణిజ్య

తొలిరోజు 11 వేల కోట్ల స్పెక్ట్రం వేలం

న్యూఢిల్లీ, జూన్ 25: స్పెక్ట్రం వేలానికి టెలికం సంస్థల నుంచి అనూహ్య స్పందన లభించింది. తొలిరోజు నిర్వహించిన ఐదు రౌండ్లలో రూ.11 వేల కోట్ల విలువైన వాయుతరంగాలకు బిడ్లు దాఖలయ్యాయని తెలుస్తున్నది. ఈసారి నిర్వహిస్తున్న 10,500 మెగాహెట్జ్ స్పెక్ట్రం వేలం ద్వారా రూ.96,238 కోట్ల నిధులు సమకూరవచ్చునని కేంద్రం అంచనావేసింది. ఈ వేలం రెండోరోజు బుధవారం కూడా కొనసాగనున్నది. తొలి రోజు నిర్వహించిన 900, 1800 మెగాహెట్జ్ బాండ్స్ వేలంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు పాల్గొన్నాయి.

ఐపీవోకి మారుతి ఇస్పాత్

హైదరాబాద్, జూన్ 25: దక్షిణాదిలో రెండో అతిపెద్ద స్టీల్ తయారీ సంస్థ మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంఐపీపీఎల్)...నూతన బ్రాండ్ 'ఎంఎస్ వాయు'ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో అభిశేక్ అగర్వాల్ మాట్లాడుతూ..వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడానికి వచ్చే ఐదేండ్లలో రూ.2 వేల కోట్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతానికి దక్షిణాదితోపాటు పడమర భారతంలో తన ఉత్పత్తులను విక్రయిస్తున్న సంస్థ..వచ్చే ఐదేండ్లలో ఉత్తర, తూర్పు భారతానికి విస్తరించనున్నట్లు, ఇందు కోసం కొత్తగా స్టీల్ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం వచ్చే రెండేండ్లలో ఐపీవోకి రాబోతున్నట్లు చెప్పారు.

సిడ్స్ ఫార్మ్ 83 కోట్ల సేకరణ

హైదరాబాద్, జూన్ 25: డెయిరీ స్టార్టప్ సిడ్స్ ఫార్మ్..వ్యాపార విస్తరణ కోసం అవసరమయ్యే నిధులో 10 మిలియన్ డాలర్ల(రూ.83 కోట్లు)ను పెట్టుబడిదారుల నుంచి సేకరించింది. ఈ నిధులతో హైదరాబాద్‌తోపాటు బెంగళూరులో ఉన్న పాల ఉత్పత్తుల కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడానికి వినియోగించనున్నట్లు కంపెనీ ఫౌండర్ కిశోర్ ఇందుకూరి తెలిపారు. అధిక నాణ్యత పాల ఉత్పత్తులకు పెరగనున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 2016లో హైదరాబాద్ కేంద్రంగా పాల ఉత్పత్తుల సేవలను ఆరంభించిన సంస్థకు ప్రస్తుతం ఈ రెండు నగరాల్లో 25 వేల మంది కస్టమర్లు ఉన్నారు.

జోష్‌లో మార్కెట్లు

ఆల్‌టైమ్ హైల్లో సూచీలు

క్యూ4లో కలిసొచ్చిన కరెంట్ ఖాతా మిగులు

712 పాయింట్లు ఎగిసి తొలిసారి 78వేలపైకి సెన్సెక్స్

183 పాయింట్లు పెరిగి 23,721 స్థాయికి నిఫ్టీ

మదుపరులను ఆకట్టుకున్న బ్యాంకింగ్, ఐటీ షేర్లు

ముంబై, జూన్ 25: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలను అందుకున్నాయి. ఈ క్రమంలోనే ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 78వేల మార్కును దాటింది. 712.44 పాయింట్లు లేదా 0.92 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 78,053.52 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 823.63 పాయింట్లు అందిపుచ్చుకొని 78,164.71 స్థాయిని తాకింది. తద్వారా ఇంట్రా-డే హై రికార్డును నెలకొల్పింది. ఈ నెల 10న సెన్సెక్స్ మొదటిసారి 77వేల మార్కును అందుకున్న విషయం తెలిసిందే. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 183.45 పాయింట్లు లేదా 0.78 శాతం ఎగిసి గతంలో ఎన్నడూ లేనివిధంగా 23,721.30 వద్ద ముగిసింది. ఇంట్రా-డేలోనూ సరికొత్త స్థాయిని చేరింది. 216.3 పాయింట్లు పెరిగి 23,754.15 వద్దకు వెళ్లింది.

బ్లూచిప్ ఉత్సాహం

ఇతర ఆసియా దేశాల మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాల నడుమ మొదలైన దేశీయ స్టాక్ మార్కెట్లకు బ్లూచిప్ కంపెనీలు దన్నుగా నిలిచాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎస్బీఐ, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్ తదితర బడా సంస్థల షేర్ల కొనుగోళ్లకు మదుపరులు పోటీపడ్డారు. దీంతో సెన్సెక్స్ పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల మార్కును తాకింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్‌ల తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో సంస్థగా నిలిచింది. బీఎస్ఈలో 2.48 శాతం పెరిగి రూ.1,199.05 వద్ద ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ విలువ ఉన్నది. ఎన్ఎస్ఈలో 2.90 శాతం వృద్ధితో రూ.1,204గా ఉన్నది. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ 0.26 శాతం, 0.03 శాతం చొప్పున పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా దేశాల్లో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ఉన్నాయి. చైనా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లలో ప్రధాన సూచీలు నష్టాల్లోనే కదలాడుతున్నాయి.

రంగాలవారీగా..

బ్యాంకింగ్ రంగ షేర్లు గరిష్ఠంగా 1.87 శాతం మేర పెరిగాయి. అలాగే ఆర్థిక సేవలు 1.45 శాతం, ఐటీ 0.53 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.28 శాతం, టెక్నాలజీ 0.43 శాతం చొప్పున బలపడ్డాయి. కానీ రియల్టీ, పవర్, యుటిలిటీస్, మెటల్, టెలికం షేర్లు 1.82 శాతం నుంచి 0.28 శాతం వరకు నష్టపోయాయి. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వివరాల ప్రకారం ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులు 5.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దేశ జీడీపీలో ఇది 0.6 శాతానికి సమానం. ఇది సహజంగానే స్టాక్ మార్కెట్లకు ఉత్సాహాన్నిచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రూపాయిపై ఒత్తిళ్లను తగ్గించిందని, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులకూ మార్గాన్ని సుగమం చేసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రధాన పెట్టుబడుల వ్యూహకర్త వీకే విజయకుమార్ అన్నారు. వడ్డీరేట్ల కోతలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ నుంచి స్పష్టత రాబోతున్నదన్న సంకేతాలూ కలిసొచ్చాయని ఆయన తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

అమర రాజా దూకుడు



తెలుగు రాష్ట్రాలకు చెందిన అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ కంపెనీ షేర్ల విలువ ఈ ఒక్కరోజే 19 శాతానికిపైగా పెరిగింది. సంస్థకు అనుబంధంగా ఉన్న అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్.. లిథియం-ఐయాన్ సెల్స్ టెక్నాలజీ కోసం జీఐబీ ఎనర్జీఎక్స్‌తో చేసుకున్న లైసెన్సింగ్ ఒప్పందం.. మదుపరుల్లో జోష్‌ను పెంచింది. షేర్ల కొనుగోళ్లకు పోటెత్తారు. దీంతో బీఎస్ఈలో 19.40 శాతం వృద్ధితో రూ.1,647 వద్ద షేర్ విలువ ముగిసింది. ఒకానొక దశలో 52 వారాల గరిష్ఠాన్ని తాకుతూ 19.99 శాతం ఎగిసి 1,655.20కు చేరింది. ఎన్ఎస్ఈలోనూ 19.56 శాతం లాభపడి రూ.1,650 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 19.99 శాతం ఎగబాకి 52 వారాల గరిష్ఠాన్ని చేరుతూ 1,656.05 వద్దకు వెళ్లింది.

బ్యాంకింగ్ సేవలకు స్మార్ట్ లాక్

వినూత్న సేవలకు ఐసీఐసీఐ బ్యాంక్ శ్రీకారం

న్యూఢిల్లీ, జూన్ 25: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్..మరో వినూత్న సేవలకు శ్రీకారం చుట్టింది. బ్యాంకింగ్ సేవలను లాక్ చేసుకోవడంతో పాటు అన్‌లాక్ చేసుకునే సేవలను ప్రారంభించింది. ఇందుకోసం స్మార్ట్‌లాక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలతో బ్యాంక్ ఖాతాకు లాక్ లేదా అన్‌లాక్ చేసుకోవచ్చును. అలాగే యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించి లావాదేవీలను కూడా నిలిపివేసుకోవచ్చును. ఫోన్ లేదా ఈ-మెయిల్ అవసరం లేకుండానే తమ ఖాతాకు సంబంధించిన అన్ని రకాల సేవలను నిలిపివేసుకోవచ్చును. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇలాంటి నూతన సేవలు అందుబాటులోకి రావడం ఇదే తొలిసారి. ఈ స్మార్ట్‌లాక్ ద్వారా ఖాతాదారుడు ఐమొబిలీ పే సేవలను నిలిపివేసుకోవచ్చునని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.

స్మార్ట్‌లాక్ ఫీచర్స్ ఇవే..

- ఐమొబిలియో పేలో లాగిన్ కావాలి
- హోమ్ స్క్రీన్ కుడి దిగువ మూలలో స్మార్ట్‌లాక్ ఫీచర్ బటన్‌ను నొక్కాలి.
- దీంతో కీలక బ్యాంకింగ్ సేవలను లాక్/అన్‌లాక్ చేసుకునే వీలుంటుంది.

తగ్గిన జావా 350 బైకు ధర

న్యూఢిల్లీ, జూన్ 25: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా కీలక నిర్ణయం తీసుకున్నది. తన ప్రీమియం బైకులు జావా మాడళ్ల ధరలను రూ.15 వేల వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది తొలినాళ్లలో దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన క్లాసిక్ 350, జావా 350 మాడళ్లు రూ.2.14 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నాయి. దీంతో జావా 350 బైకు ధర రూ.2,14,950 నుంచి రూ.1,98,950కి దిగొచ్చింది. ఈ బైకు 334 సీసీ సామర్థ్యంతో రూపొందించింది.

ఎఫ్ఎంసీజీలో 9% వృద్ధి

న్యూఢిల్లీ, జూన్ 25: ఈ ఏడాదిలో ఎఫ్ఎంసీజీ రంగం 7-9 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఎఫ్ఎంసీజీ రంగానికి ప్రభుత్వం అండదండగా ఉండటం, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. అయినప్పటికీ ఈ రంగం పలు సవాళ్లను ఎదుర్కొనున్నదని, ముఖ్యంగా ద్రవ్యోల్బణం ఒత్తిడి, కొనుగోలు దారుల్లో విశ్వాసం కోల్పోవడం, నిరుద్యోగం అధికంగా ఉండటం వంటి సమస్యలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించింది.

ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యం

వృద్ధిరేటును అధిక వడ్డీరేట్లు అడ్డుకోవు • ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబై, జూన్ 25: దేశ జీడీపీ వృద్ధిరేటును అధిక వడ్డీరేట్లు అడ్డుకోబోవని ఆర్బీఐగవర్నర్ శక్తికాంత దాస్ నొక్కిచెప్పారు. మంగళవారం ఇక్కడ బాంబే చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్రవ్యోల్బణం అదుపే ఆర్బీఐ లక్ష్యమని స్పష్టం చేశారు. ధరల నియంత్రణకు తగ్గట్టుగానే ద్రవ్య విధానం ఉంటుందని, ఇందులో ఎలాంటి సందేహాలు అక్కర్లేదని తేల్చిచెప్పారు. దేశ జీడీపీ 8 శాతం దిశగా వెళ్తున్నదన్న దాస్.. వృద్ధిరేటు బాగుంటే, ఆకర్షణీయంగా ఉంటే ఇప్పుడున్న అధిక వడ్డీరేట్ల ప్రభావం లేనట్టేగా అని చెప్పుకొచ్చారు. ఇక ద్రవ్యోల్బణం గణాంకాలపై స్పందిస్తూ.. 2022 లో గరిష్ఠంగా 7.8 శాతంగా ఉన్నదని, ఇప్పుడు 3.1 శాతం నుంచి 4.7 శాతం మధ్యకే పరిమితమైందని దాస్ అన్నారు. వర్షాభావ పరిస్థితులు ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయని కూడా వ్యాఖ్యానించారు. ధరల అదుపుపైనే ఆర్బీఐ దృష్టి పెట్టడంవల్ల రైతాంగానికి ఇబ్బందులు ఉంటున్నాయన్న వాదనల్ని దాస్ తోసిపుచ్చారు. రైతులూ వినియోగదారులేనన్న ఆయన ద్రవ్యోల్బణం తగ్గితే వారికీ ప్రయోజనమేనన్నారు.

పరోక్ష పన్నులు తగ్గాలి

ముందస్తు బడ్జెట్ చర్చల్లో పరిశ్రమ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 25: పరోక్ష పన్నులను తగ్గించాలని, సుంకాల నిర్మాణాన్ని హేతుబద్ధం చేయాలని వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, సంఘాల నాయకులు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ముందస్తు బడ్జెట్ చర్చల్లో భాగంగా మంగళవారం మంత్రితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) అధ్యక్షుడు అశ్వినీ కుమార్.. వచ్చే ఐదేండ్లకుగాను ఇంట్రెస్ట్ ఈక్వలైజేషన్ స్కీంను పొడిగించాలని కోరారు. ఈ స్కీం ఈ నెలాఖరుతో ముగుస్తున్నది. అలాగే రాబోయే బడ్జెట్‌లో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని పొడిగించాలని దేశీయ తోలు, పాదరక్షల ఎగుమతిదారులు కోరుతున్నారు.

బంగారం, వెండిపై..

బంగారం, వెండి, ప్లాటినం కడ్డీలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని రత్నాలు, ఆభరణాల ఎగుమతిదారుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) డిమాండ్ చేస్తున్నది. వచ్చే బడ్జెట్‌లో 4 శాతానికి దించాలని కోరింది. ప్రస్తుతం 15 శాతం పడుతున్నది. ఇక ఎగుమతులు పెరిగేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలని, ప్రత్యేక నోటిఫైడ్ జోన్లలో ముడి వజ్రాల అమ్మకాలకూ అనుమతివ్వ